క్లుప్తంగా

హక్కుల సాధనకు పోరాటం

కొడకండ్ల: ఎస్సీ, ఎస్టీ, బీసీల హక్కుల సాధనకు రెండు దశాబ్దాలుగా జైభారత్ ఉద్యమిస్తుందని జైభారత్ సామాజిక విప్లవ రణభేరి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో శ్రీను నాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నారాయణగురు, పూలే, అంబేడ్కర్, గాంధీ తదితరుల స్ఫూర్తితో జైభారత్ పోరాట వేదికలు పనిచేస్తున్నాయన్నారు. సమావేశంలో గణేష్, వెంకన్న, మధు, సోమశేఖర్, యాకూబ్, కృష్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

విజయదుర్గాదేవికి 'పొన్నాల' ప్రత్యేక పూజలు


పూజ చేస్తున్న పొన్నాల లక్ష్మయ్య

రఘునాథపల్లి: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన విజయదుర్గాదేవి ఆలయంలో మాజీ పీసీసీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య దుర్గాదేవికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. పది రోజుల పాటు గ్రామస్తులు ఊరుమ్మడిగా గ్రామదేవతల ఉత్సవాలు విజయవంతం చేసుకోవడం పట్ల పొన్నాల అభినందించారు. ఈ సందర్భంగా పొన్నాల మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకొని భక్తి భావం వైపు నడవాలని పేర్కొన్నారు. సర్పంచ్ పోకల శివకుమార్, ఎంపీటీసీ పేర్ని ఉషారవి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవిగౌడ్, చిన్ననాగేష్, కడారి రవి, యాదగిరి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నివాళి



రఘునాథపల్లి: మండల కేంద్రానికి చెందిన ఆటో డ్రైవర్ కడారి నర్సింహులు (32) ఆర్థిక ఇబ్బందులతో శనివారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ఆదివారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి రఘునాథపల్లికి చేరుకొని మృతదేహాన్ని సందర్శించి పూలమాలతో నివాళులర్పించారు. అంతిమయాత్రలో రోదిస్తున్న మృతుడి కుమారులను ఓదార్చి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. అదే విధంగా కాంగ్రెస్ జిల్లా నాయకులు గాదె మహేందర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, కడారి రవి, ఐలమల్లేష్, ఆటో యూనియన్ నాయకులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

పేర్లు నమోదు చేసుకోవాలి

బచ్చన్నపేట: సీఎం కప్ క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఎంపీడీఓ రఘురామకృష్ణ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సీఎం కప్ క్రీడలు మండల స్థాయిలో ప్రారంభమవుతాయని ఆటల్లో పాల్గొనే వారు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెంకడరీ పాఠశాలలో నేడు (సోమవారం) సాయంత్రం 4 గంటల వరకు తమ పేర్లను పీఈటీ వీర్యానాయక్ వద్ద నమోదు చేసుకోవాలని తెలిపారు. రేపు (మంగళవారం) ఉదయం 7 గంటలకు అథ్లెటిక్స్, ఫుట్ బాల్, కబడ్డీ, ఖో-ఖో, వాలీ బాల్ క్రీడలు ప్రారంభమవుతాయని, ఆసక్తిగల క్రీడాకారులు పాల్గొనాలని పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయండి


కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

పాలకుర్తి టౌన్: ధాన్యం కొనుగోళ్లను సత్వరమే పూర్తి చేయాలని తహసీల్దార్ భూక్య పాల్‌సింగ్ సూచించారు. ఆదివారం మండలంలోని చెన్నూరు, మైలారం, విస్నూరు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో తేమ 17 శాతం మించరాదని, అరబెట్టిన ధాన్యాన్ని మాత్రమే తీసుకురావాలని సూచించారు. ధాన్యం మిల్లులకు తరలించేందుకు వాహనాల కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. ఆయన వెంట పాలకుర్తి సొసైటీ వైస్ చైర్మన్ కారుపోతుల వేణు, సివిల్ సప్లై డీటీ గుగులోతు దేవానాయక్ తదితరులు ఉన్నారు.

వైభవంగా హనుమాన్ జయంతి


జనగామ రూరల్: పూజ చేస్తున్న భక్తులు


ఉప్పలమ్మ సమేత ఆంజనేయస్వామి ఆలయంలో..


స్టేషన్‌ఘన్‌పూర్: శోభాయాత్రలో ఎమ్మెల్యే రాజయ్య


బచ్చన్నపేట: పోచన్నపేటలో..

జనగామ రూరల్: హనుమాన్ జయంతిని ఆదివారం పలు దేవాలయాల్లో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో రామనాథ సహిత శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో ప్రధాన అర్చకులు మోహనకృష్ణ భార్గవ ఆధ్వర్యంలో పూజలు చేపట్టారు. దేవస్థాన కమిటీ గౌరవ అధ్యక్షుడు గజ్జెల నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే ఉప్పలమ్మ సమేత ఆంజనేయస్వామి ఆలయంలో పూజారి పవన్ శర్మ పూజలు చేశారు.

హనుమాన్ సంకీర్తనలతో మార్మోగిన ఘన్‌పూర్

స్టేషన్‌ఘన్‌పూర్: హనుమాన్ జయంతి సందర్భంగా ఘన్‌పూర్ హనుమాన్ భక్త మండలి ఆధ్వర్యంలో డివిజన్ కేంద్రంలో వీర హనుమాన్ శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. స్థానిక రిజర్వాయర్ కట్ట సమీపాన ఉన్న హనుమాన్ దేవాలయం నుంచి హనుమాన్ మాలాధారణ చేసిన భక్తులు, భక్త మండలి ఆధ్వర్యంలో శోభాయాత్రను ప్రారంభించారు.

హాజరైన ఎమ్మెల్యే రాజయ్య

ఘన్‌పూర్‌లో హనుమాన్ భక్త మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన హనుమాన్ శోభాయాత్రకు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య హాజరయ్యారు. హనుమాన్ భక్తులతో కలిసి శోభాయాత్రలో పాల్గొన్నారు. స్థానిక సర్పంచ్ తాటికొండ సురేష్‌కుమార్, ఎంపీటీసీ గన్ను నర్సింహులు, మునిగెల రాజు, హనుమాన్ భక్త మండలి బాధ్యులు గోనెల రాజేందర్, ఇల్లందుల ప్రసాద్, బంగ్లా శ్రీను, మొగుదుంపురం కిషోర్, నీల గట్టయ్య, పెసరు సారయ్య, గోనెల ఉప్పలయ్య, కొలిపాక వేణు, కుంభం నరేందర్, హనుమాన్ భక్తమండలి బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

మహా అన్నదానం..

హనుమాన్ జయంతి సందర్భంగా ఘన్‌పూర్ అభయాంజనేయస్వామి దేవస్థానం వద్ద బీఆర్ఎస్ జిల్లా నాయకులు చింతకుంట్ల నరేందర్‌రెడ్డి, చింతకుంట్ల జగన్‌రెడ్డి ఆధ్వర్యంలో మహాఅన్నదానం కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమానికి ఘన్‌పూర్ ఏసీపీ రఘుచందర్ ముఖ్య అతిథిగా హాజరై అన్నదానం ప్రారంభించారు.


స్టేషన్‌ఘన్‌పూర్: హనుమాన్ శోభాయాత్ర

శోభాయాత్రకు హాజరైన బొజ్జపల్లి సుభాష్

ఘన్‌పూర్‌లో హనుమాన్ శోభాయాత్రలో బీజేపీ రాష్ట్ర నాయకుడు బొజ్జపల్లి సుభాష్ హాజరయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ హనుమాన్ జయంతి సందర్భంగా శోభాయాత్ర నిర్వహించడం అభినందనీయమని అన్నారు.

చిల్పూరు: చిల్పూరు బుగులు వేంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలోని హనుమాన్ ఆలయంలో ఆదివారం అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాల నడుమ హనుమాన్ జయంతి నిర్వహించారు. హనుమాన్ భక్తులకు ఈఓ భాగం లక్ష్మీప్రసన్న సౌకర్యాలు కల్పించగా ఆలయ దాత గుల్లపల్లి శ్రీనివాస్-భవాని దంపతులు అన్నదానం చేశారు. సిబ్బంది లక్ష్మి, రమేష్, వీరన్న, స్వరూప, కృష్ణ తదితరులు ఉన్నారు.

రఘునాథపల్లి: మండల కేంద్రంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఘనంగా హనుమాన్ జయంతి నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణాలతో హనుమాన్ విగ్రహానికి అభిషేకాలు చేసి 108 తమలపాకులతో పూజలు చేశారు. ఈ సందర్భంగా గబ్బెట గ్రామానికి చెందిన గొల్లపల్లి ఈశ్వరమ్మ మహిళా భజన బృందం హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. శ్రీరామ్‌రెడ్డి కృష్ణమూర్తి పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో ఆలయ చైర్మన్ లగిశెట్టి భిక్షపతిబాలమణి, శ్రీ రామదాసు భజన మండలి రాష్ట్ర అధ్యక్షుడు ఎం సిద్దేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


చిల్పూరు: హనుమాన్ ఆలయంలో ఈఓ, భక్తులు


వడలతో హనుమంతుడికి అలంకరణ


తరిగొప్పులలో పూజ చేస్తున్న భక్తులు

సోమేశ్వర ఆలయంలో..

పాలకుర్తి టౌన్: శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి, మండల కేంద్రంలోని పాటిమీది ఆంజనేయస్వామి ఆలయాల్లో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వెనుకదాసుల రామచంద్రయ్యశర్మ, ఈఓ భాగం లక్ష్మీప్రసన్న, ఆలయ పర్యవేక్షకులు వెంకటయ్య, అర్చకులు దేవగిరి రామన్న, లక్ష్మన్న, డీవీఆర్‌శర్మ, అనిల్‌కుమార్, నాగరాజు, గంగు రఘుశర్మ, సిబ్బంది అశోక్, శ్రీనివాస్, రాములు పాల్గొన్నారు.

తరిగొప్పులలో..

తరిగొప్పుల: మండలకేంద్రంలోని శ్రీభక్తాంజనేయ స్వామి ఆలయంలో అర్చకుడు బృంగి పరమేశ్వర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండుగ కనకయ్య, నాగబండి రాజు, జీడిగం భిక్షపతి, కాసుల రామస్వామి, జంగ రవి, వినేష్, గాడి రాజు, గట్టుమల్లు పాల్గొన్నారు.

బచ్చన్నపేటలో..

బచ్చన్నపేట: హనుమాన్ జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల హనుమాన్ ఆలయాల్లో ఆదివారం ఘనంగా పూజలు నిర్వహించారు. అలాగే హనుమాన్ మాలాధారులు కొండగట్టు, వేములవాడ, యాదగిరిగుట్టలకు మాలవిరమణకు వెళ్లారు. కొడవటూర్‌లోని శ్రీ సిద్దేశ్వరాలయంలో స్వాములు మాలవిరమణ చేశారు. పోచన్నపేటలోని హనుమాన్ ఆలయంలో యజ్ఞ, హోమాలను నిర్వహించారు.


పాలకుర్తి టౌన్: శ్రీసోమేశ్వరాలయంలో..

కొడకండ్లలో..

కొడకండ్ల: కొడకండ్ల, రామవరం, లక్ష్మక్కపల్లి గ్రామాల్లోని ఆంజనేయ స్వామి ఆలయాల్లో పంచామృత అభిషేకాలు, అర్చనలు, విశేష పూజలు నిర్వహించి ఆంజనేయస్వామిని అలంకరించారు. మాలధారణ స్వాములు ఆలయాల్లో పూజలు నిర్వహించి ఇరుముడిలతో మాలవిరమణ కోసం కొండగట్టు, విజయవాడ, భద్రాచలం వంటి పుణ్య క్షేత్రాలకు తరలి వెళ్లారు.

జఫర్‌గఢ్‌లో..

జఫర్‌గఢ్: మండలంలోని ఆయా గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలు అంత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జఫర్‌గఢ్‌లోని బైరాగి హనుమాన్ దేవస్థానంలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి శోభాయాత్ర చేపట్టారు.


లింగాలఘణపురంలో.. శోభాయాత్ర


కొడకండ్ల: మాల విరమణకు ఇరుముడులతో బయలుదేరిన మాలధారులు


జఫర్‌గఢ్‌లో..


రఘునాథపల్లి: కన్యకా పరమేశ్వరి ఆలయంలో..

వనపర్తిలో..

లింగాలఘణపురం: మండలంలోని వనపర్తిలో హనుమాన్ జయంతి సందర్భంగా ఆదివారం రాత్రి హనుమాన్ మాలధారణ భక్తులతో పాటు గ్రామస్తులు శోభయాత్ర నిర్వహించారు. సర్పంచ్ శ్రీధర్, ఎంపీటీసీ రాజిరెడ్డి, భక్తులు వంగ వెంకటేశ్వర్లు, కామిడి రాజశేఖర్‌రెడ్డి, వంచ సుదర్శన్‌రెడ్డి, జాయ బుచ్చయ్య, వంచ మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కొండగట్టుకు హనుమాన్ మాలధారులు

మండల కేంద్రంలో గత 40 రోజులుగా హనుమాన్ మాలధారులు అత్యంత భక్తిశ్రద్ధలతో దీక్ష పూర్తి చేసుకొని ఆదివారం హనుమాన్ జయంతి సందర్భంగా ఇరుముళ్లు కట్టుకొని కొండగట్టుకు బయలుదేరారు. వేదపండితులు ఉమానాథశర్మ మంత్రోచ్చారణలతో శివాలయంలో ప్రత్యేక పూజలు చేసి ఇరుముళ్లకట్టుకొని వెళ్లారు. మాలధారులు తదితరులు ఉన్నారు.

విజయవంతం చేయాలి

జఫర్‌గఢ్: ఈ నెల 27, 28 తేదీల్లో జఫర్‌గఢ్‌లో నిర్వహించనున్న సీపీఐ జిల్లా రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి జువారి రమేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సీపీఐ జిల్లా రాజకీయ శిక్షణ తరగతులకు సంబంధించిన కరపత్రాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెండ్యాల సమ్మయ్య, ఎండి జాఫర్, ముసలయ్య, కలకోట ప్రభాకర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

క్రీడా సామగ్రి అందజేత



బచ్చన్నపేట: బండనాగారంలో వెలుపుల కిష్టయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారుడు నరేష్ క్రీడా సామగ్రి అందజేశారని సర్పంచ్ శివరాత్రి కవిత తెలిపారు. ఆదివారం సర్పంచ్ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా క్రీడల్లో రాణించాలన్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం క్రీడా ప్రాంగణంలో వాలీబాల్, క్రికెట్ క్రీడల్లో పాల్గొనాలన్నారు. దాత నరేష్ రెండు వాలీబాల్‌లు, నెట్, వాలీ బాల్ పంపును అందజేశారని చెప్పారు. శివరాత్రి రాజనర్సు, భరద్వాజ్, సాయిరాం, చక్రపాణి క్రీడాకారులు పాల్గొన్నారు.

మైసమ్మ తల్లికి బోనాలు


బోనాలతో మహిళలు

బచ్చన్నపేట: మండలంలోని కొడవటూర్‌లో కర్రాలకుంట మైసమ్మ తల్లికి శనివారం రాత్రి గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో భోనాలు చేశారు. గ్రామస్తులు భోనాలను అంగరంగ వైభవంగా డప్పు చప్పుళ్లతో బైండ్ల వారి జమిడిక నాదాలతో శివసత్తుల పూనకాలతో అమ్మవారి వద్దకు తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ సర్పంచ్ గంగం సతీష్‌రెడ్డి, ఉప సర్పంచ్ అత్మారి రమేష్, పూజారి భాస్కర్, నాయకులు అంజయ్య, కరుణాకర్, తిరుపతి, చెట్టె మల్లేష్, అయిలయ్య, రాములు పాల్గొన్నారు.

మిల్లర్లపై చర్య తీసుకోవాలి


నిరసన తెలుపుతున్న సుభాష్, రైతులు

చిల్పూరు: రైతులను మోసం చేస్తున్న మిల్లర్లపై చర్య తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు బొజ్జపల్లి సుభాష్ ప్రభుత్వాన్ని డిమాండ్ అన్నారు. మండలంలోని మల్కాపూర్‌లోని ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఆయన సందర్శించి రైతుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు పోలేపల్లి లింగారెడ్డి, తిరుమలరెడ్డి, ఎల్లయ్య, మహేందర్‌లతో కలిసి నిరసన చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో నేటికీ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకపోయి ఉన్నాయని అన్నారు. కొనుగోలు కేంద్రం నుంచి ఇటీవల 2,592 క్వింటాళ్ల ధాన్యాన్ని మిల్లుకు తరలిస్తే అక్కడకి వెళ్లే సరికి 2,488 క్వింటాళ్లు మాత్రమే అయ్యాయన్నారు. వంద క్వింటాళ్లకు పైగా రైతులను తరుగు పేరుతో మోసం చేయడం దారుణమన్నారు. ఇలాంటి సంఘటనలు మిల్లుల్లో జరుగకుండా చూడాలని అన్నారు. నిరసన విషయం తెలుసుకున్న ఐకేపీ ఏపీఎం ఈద రమేష్‌కుమార్, ఆర్ఐ కల్వల శ్రీనివాస్ అక్కడికి చేరుకుని దీనిపై విచారణ చేస్తామని అన్నారు. కార్యక్రమంలో గంటె ఉపేందర్‌యాదవ్, దోరం శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

బాబోయ్ కోతులు..

- ఆదమరిస్తే ఇంట్లోని వస్తువులు మాయం
- చర్యలు తీసుకోవాలంటున్న ప్రజలు

చిల్పూరు: తెలంగాణలో రెండో తిరుమల తిరుపతిగా పేరుగాంచిన చిల్పూరు మండల కేంద్రంలోని చిల్పూరుగుట్ట వద్ద కోతుల బెడద అధికంగా ఉంది. దీంతో స్థానికులతో పాటు, భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడి ప్రజలు ఏళ్లుగా కోతులతో సహవాసం చేస్తున్నారు. అదమరిస్తే చాలు ఇంట్లో వస్తువులు ఏవీ ఉండడం లేదు. కోతుల నివారణకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రతీ ఇంటికి జాలీ, ఇంటి పైకప్పుపై కంప

చిల్పూరుగుట్ట కింద నివాసం ఉండే వారు తలుపులు తీసి ఉంటే చాలు ఇంట్లోని తినుబండారాలను కోతులు ఎత్తుకెళ్తున్నాయి. దీంతో అవి రాకుండా ఉండేందుకు జాలీలు ఏర్పాటు చేసుకున్నారు. రేకుల ఇళ్ల పైకప్పుపై కంప వేసుకున్నారు.


గుట్ట వద్ద కోతుల గుంపు


దుకాణం చుట్టు ఏర్పాటు చేసిన జాలీ, రేకులపై ముళ్లకంప

బయటకు వస్తే కట్టె పట్టుకోవాల్సిందే..



ఇంట్లో నుంచి బయటకు వస్తే చేతిలో కట్టె ఉండాల్సిందే. లేకుంటే ఒక్కోసారి కోతుల గుంపు మీద పడుతాయి. బంధువులు వస్తే ఇదేమిటని ప్రశ్నిస్తున్నారు. ఈ బాధ ఎన్నడు తీరుతుందో.

– నారగోని రాజు, స్థానికుడు

కోతుల బెడదకు జాలీలు..



తమది చిన్న హోటల్. వివిధ రకాల తినుబండారాలు చేసి అమ్ముతుంటా. గతంలో కోతుల రక్షణకు పరదాలు కట్టేవాళ్లం. ఇప్పుడు ఏ చిన్న సందు దొరికినా ఇక అంతే. ఏ ఒక్కటి కోతులు వదలడం లేదు. దీంతో జాలీ ఏ ర్పాటు చేయించా. అందుకు చాలా ఖర్చు అయింది.

– మూల స్వప్న, హోటల్ యజమాని

పిల్లలు ఇంటికి చేరేవరకు భయమే..



అంగన్ వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు తిరిగి ఇంటికి వెళ్లే వరకు భయమే. భోజనం చేసే ముందు ఎక్కడ కోతులు వచ్చి గాయపరుస్తాయేమోనని జాగ్రత్త వహించాల్సి వస్తోంది. ఎండా కాలం కోతులతో ఇబ్బంది మరీ ఎక్కువ.

– సట్ల కవిత, అంగన్‌వాడీ టీచర్

'స్పోకెన్ ఇంగ్లిష్' నిర్వహణ అభినందనీయం


పుస్తకాలు అందజేస్తున్న గంట రవీందర్

పాలకుర్తి: పాఠశాలల్లో టీఎస్ యూటీఎఫ్, పూలే అధ్యయన వేదిక ఆధ్వర్యంలో స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని విద్యాభిమాని, హెల్పింగ్ హ్యాండ్స్ కన్వీనర్ గంట రవీందర్ అన్నారు. ఆదివారం ఉచిత ఇంగ్లిష్ శిక్షణ తరగతులను ఆయన సందర్శించి మాట్లాడారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆయన సూచించారు. తన వంతు సాయంగా పుస్తకాలను అందజేస్తానని తెలిపారు. టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి చిక్కుడు శ్రీనివాస్, మండల అధ్యక్షుడు వీరమల్ల బాబయ్య, చిదిరాల రమేష్ పాల్గొన్నారు.

బేడ బుడిగ జంగాల సంబురాలు


సంబురాలు చేసుకుంటున్న నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్: కర్ణాటక రాష్ట్రంలో కోలార్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నుంచి బేడ బుడిగ జంగాల సామాజిక వర్గానికి చెందిన కొత్తూరు మంజునాథ వెంకటరమణ అఖండ విజయం సాధించడంపై డివిజన్ కేంద్రంలో బేడ బుడిగ జంగాలు ఆదివారం సంబురాలు చేసుకున్నారు. కర్ణాటకలో ఎన్నికల ప్రచార సమయంలో ఘన్‌పూర్ నుంచి కోలార్ వెళ్లి ప్రచారం చేసిన స్థానిక శ్రీకారం యూత్ సభ్యుల ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. బాణాసంచాలు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పస్తం బాలు, పస్తం ప్రసాద్, పస్తం కల్యాణ్, మోటం యాకయ్య, కడమంచి లక్ష్మీపతి, బేడబుడిగ జంగం కులపెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థినికి సన్మానం



స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని శివునిపల్లికి చెందిన కుంభం ఉపేందర్ కుమార్తె కుంభం వైష్ణవి స్థానిక మోడల్ స్కూల్‌లో చదివి పదోతరగతి వార్షిక పరీక్షల్లో 10/10 జీపీఏ సాధించి మండల టాపర్‌గా నిలిచింది. ఈ మేరకు ఆదివారం శివునిపల్లిలోని పెద్దమ్మతల్లి దేవాలయం వద్ద స్నేహ పరపతిసంఘం ఆధ్వర్యంలో వైష్ణవిని సన్మానించారు. ముదిరాజ్ అమ్మాయి ప్రభుత్వ పాఠశాలలో చదివి పది పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చాటడం అభినందనీయమన్నారు. పరపతి సంఘం అధ్యక్షుడు అలుగు సమ్మయ్య, సభ్యులు రేగుల శ్రీనివాస్, రమేష్, వేణు, రాజు, సోమన్న, రాములు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.